క్లుప్తంగా

నేడు హరిత దినోత్సవం

హుజూర్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణలో హరిత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నడిగూడెం : తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేకంగా హరిత హారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ యం.యర్రయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా 6వేల మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేశామని, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పీవైఎల్ మహాసభలను విజయవంతం చేయాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

కోదాడరూరల్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈనెల 24న నిర్వహించే పీవైఎల్ (ప్రగతిశీల యువజన సంఘం) జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు కామల్ల అనంతరామయ్య అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని కొమరబండలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. పాలకవర్గాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, యువత, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగుల, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. కార్యక్రమంలో మద్దెల వెంకన్న, రజని, వెంకన్న, రవి, కోటేష్, ప్రతాప్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తు గడువును పొడిగించాలి

కోదాడరూరల్ : తెలంగాణ ప్రభుత్వం అందించనున్న రూ.లక్ష బీసీ రుణాల కోసం దరఖాస్తు గడువును పొడిగించాలని టీడీపీ మహిళా రాష్ట్ర కార్యదర్శి ఉప్పగండ్ల సరోజ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 20 చివరి తేదీ కావడంతో దరఖాస్తు చేసుకొనేందుకు కావాల్సిన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు ఆన్‌లైన్ కాక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈనెల చివరి వరకు తేదీని పొడిగించి కుల, చేతి వృత్తిదారులందరూ దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు.

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్


అనంతుల శ్రీనుగౌడ్

మునగాల : మండలంలోని కలకోవ గ్రామానికి చెందిన అనంతుల శ్రీనుగౌడ్ బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయనను నియమించినట్లు నియోజకవర్గ అధ్యక్షుడు కందుకూరి ఉపేందర్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనుగౌడ్ మాట్లాడుతూ.. మండలంలో పార్టీ బలోపేతానికి తాను శక్తివంచన లేకుండా కృషిచేస్తానని అన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయం ఆవరణలో ఈనెల 21న బుధవారం జరిగే దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ ఈఓ ఎంపీ లక్ష్మణరావు ఆదివారం కోరారు.

20న కంటి వైద్యశిబిరం

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో ఈనెల 20న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చెన్నయ్య, వీరారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, వారిపై ఆధారపడిన వారు, ఈహెచ్ఎస్ హెల్త్ కార్డు ఉన్న వారికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

అవినీతిపై విచారణ జరపాలి

కోదాడరూరల్ : మండల పరిధిలోని గుడిబండ గ్రామంలో దళిత బంధు పథకంలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామంలో పలువురు లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం దళితుల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన పథకంలో ఒక్కో యూనిట్‌కు రూ.2నుంచి రూ.3లక్షలు వరకు వసూలు చేయడం శోచనీయమన్నారు. ముందస్తుగా డబ్బుల కోసం అగ్రిమెంట్ రాయించుకోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. అధికారులు గ్రామంలో సమగ్ర విచారణ జరిపి తీసుకున్న డబ్బులు వెనక్కి ఇప్పించాలని కోరారు. ఆయన వెంట సాయి, మరియన్న, గ్రామస్తులు ఉన్నారు.

శుద్ధజలాలు అందించడమే లక్ష్యం

● జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య


మఠంపల్లి : మట్టపల్లి వద్ద నీటి శుద్ధి ట్యాంకును పరిశీలిస్తున్న డీపీఓ, ఎంపీపీలు

మఠంపల్లి : అన్ని గ్రామాలకు మిషన్‌భగీరథ పథకం ద్వారా శుద్ధజలాలు అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)యాదయ్య అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మట్టపల్లి గ్రామపంచాయతీలో ఆదివారం నిర్వహించిన మంచినీళ్ల పండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతానికి భిన్నంగా గ్రామపంచాయతీల సహకారంతో గ్రిడ్‌ల ద్వారా ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను నింపి తద్వారా ఇంటింటికి స్వచ్ఛమైన మంచినీరు అందిస్తునట్లు తెలిపారు. అదే విధంగా ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం స్థానికంగా గల కృష్ణానదీనీటి పంపింగ్ ట్యాంకును ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. సమావేశంలో మఠంపల్లి, హుజూర్‌నగర్, గరిడేపల్లి ఎంపీపీలు ముడావత్ పార్వతీకొండానాయక్, గూడెపు శ్రీనివాస్, పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ జగన్‌నాయక్, మట్టపల్లి సర్పంచ్ విజయలక్ష్మి, స్పెషల్ ఆఫీసర్ సంధ్యారాణి, ఎంపీడీఓ జానకిరాములు, ఎంపీఓ ఆంజనేయులు, ఏపీఓ, ఇంజనీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

మఠంపల్లి మండలంలో..

మండలంలో జరుగుతున్న తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం మంచినీళ్ల పండుగ సందర్భంగా మఠంపల్లి, చౌటపల్లి, బక్కమంతులగూడెం, కామంచికుంటతండా, యాతవాకిల్ల, హనుమంతులగూడెం, వరదాపురం, చెన్నాయిపాలెం తదితర గ్రామాల్లో ర్యాలీలు, గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డుసభ్యులు, కార్యదర్శులు, పాల్గొన్నారు.

గరిడేపల్లి : తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో మంచినీళ్ల పండుగ ఘనంగా నిర్వహించారు. ముందుగా వాటర్ ట్యాంకు నుంచి గ్రామపంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ త్రిపురం సీతారాంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో గ్రామ ఉపసర్పంచ్ ఎస్‌కె సైదాబి, గ్రామ కార్యదర్శి రేణుక, వార్డుసభ్యులు మన్నెం రాంరెడ్డి, ఫీల్ అసిస్టెంట్ సరిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు రాజ్‌మహ్మద్, వెంకటేశ్వర్లులు, పలువురు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


మఠంపల్లి : మాట్లాడుతున్న డీపీఓ యాదయ్య

నడిగూడెం : తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో తెలంగాణ మంచినీళ్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ నీటి సరఫరా వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, ఎంపీఓ ఎర్ర లింగారెడ్డి, స్థానిక సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి, వల్లాపురం, చాకిరాల సర్పంచ్‌లు వట్టికూటి చంద్రయ్య, యాతాకుల వీరస్వామి, పాల్గొన్నారు.


గరిడేపల్లిలో మంచినీళ్ల పండుగ ర్యాలీ

నేరేడుచర్ల : మండలంలోని వైకుంఠాపురంలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మంచినీళ్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓవర్‌హెడ్ ట్యాంకు ద్వారా వచ్చే తాగునీటిని మహిళలకు బిందెల ద్వారా సర్పంచ్ తాటికొండ అమృతారెడ్డి అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ నాగార్జున, మంగయ్య, పలువురు మహిళలు పాల్గొన్నారు.

పాలకవీడు : తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెలంగాణ మంచినీళ్ల పండుగను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో నాటి తాగు నీటి కోసం వీధుల్లో మహిళలు పడిన కష్టాలు, మిషన్ భగీరథ ద్వారా నేడు ఇంటింటికీ నల్లా ద్వారా తాగునీరు అందిస్తున్న తీరును బ్యానర్లపై ప్రదర్శిస్తూ ర్యాలీలు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, పంచాయతీరాజ్ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


మునగాలలో నీళ్ల పండుగలో పాల్గొన్న సర్పంచ్ ఉపేందర్ తదితరులు


నేరేడుచర్ల : మహిళకు మంచినీళ్ల బిందె ఎత్తుతున్న సర్పంచ్ అమృతారెడ్డి


పాలకవీడు : ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు, అధికారులు

ఐఐటీ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో రేస్ విద్యార్థుల ప్రతిభ


ఉస్తెల సుఖేష్‌రెడ్డి, 2067 ర్యాంక్


కె.మహాలక్ష్మి, 3009 ర్యాంక్

కోదాడఅర్బన్ : ఐఐటీ ఇంజనీరింగ్ కళాశాలల ప్రవేశాల కోసం నిర్వహించిన అడ్వాన్స్‌డ్ ఎంట్రన్స్ ఫలితాలను ఆదివారం గౌహతి ఐఐటీ విడుదల చేసింది. ఈ ఫలితాల్లో కోదాడ రేస్ ఐఐటీ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఆలిఇండియా లెవెల్‌లో రేస్ కళాశాలకు చెందిన ఉస్తెల సుఖేష్‌రెడ్డి 2067 ర్యాంకు సాధించగా, కె.మహాలక్ష్మి 3009వ ర్యాంక్, ఎండీ సానియా తబ్సం 4411వ ర్యాంక్, ఎం.నందగోపాల్ 5730, యు.అక్షర సమైక్య 5746వ ర్యాంక్, వై.వినయ్ 7270వ ర్యాంకులు వివిధ కేటగిరిల్లో సాధించారు. ఈ సందర్భంగా రేస్ ఐఐటీ మెడికల్ అకాడమీ చైర్‌పర్సన్ బాణాల వసంత వెంకటరెడ్డి విద్యార్థులను అభినందించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఎంసెట్, మెయిన్స్, నీట్ ఫలితాల్లో అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకు సాధించారని తెలిపారు. కాగా అధ్యాపకులను, విద్యార్థులను అభినందించారు.

ఘనంగా కంఠమహేశ్వరస్వామి వార్షికోత్సవం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెంలో శ్రీ సురమాంబ సమేత కంఠమహేశ్వరస్వామి సప్తమ వార్షికోత్సవాన్ని మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఆదివారం చివరి రోజున స్వామివార్లకు సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యావచనం నిర్వహించారు. అనంతరం మహిళలు జల బిందెలతో స్వామివార్లకు అభిషేకాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఆలయ ప్రధాన పూజారులు రాయపోలు భద్రయ్యశర్మ, శ్రీరామయ్య శర్మ, దేవమంగళశర్మలు వేద మంత్రోత్సవాల నడుమ కంఠమహేశ్వరస్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, హుజూర్‌నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్‌లతో పాటు పలువురు నాయకులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గౌడపెద్దలు గుండు వెంకటప్పయ్య, చిన్నగౌడ్, తుమ్మల గురువయ్య, సర్దార్ సర్వాయి పాపన్న యువజన సంఘం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పాతగోల్‌తండాలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సంతోష్‌కిరణ్

అనంతగిరి : మండలంలోని ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సంతోష్‌కిరణ్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పోలీస్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో వసతులతో పాటు పలు అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

పాలకవీడు : మండలంలోని సజ్జాపురం గ్రామంలో ఆదివారం సీసీ డ్రెయినేజీ పనులను సర్పంచ్ నరసింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్‌డీఫ్ నిధులు రూ.10లక్షలతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అంతర్గత రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సహకారంతో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి కృషితో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని అన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ నర్సింహ

నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి


డబుల్ ఇళ్ల వద్ద ఆందోళన చేస్తున్న నిరుపేదలు

మోతె : అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని పలువురు నిరుపేదలు ఆదివారం మండలంలో రావిపహాడ్-అప్పన్నగూడెం గ్రామాల మధ్య నిర్మించిన డబుల్ ఇళ్ల వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రావిపహాడ్ - అప్పన్నగూడెం గ్రామాల ప్రజాప్రతినిధులు వారికి నచ్చిన వారికి, అనర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల రోజుల నుంచి అధికారుల చుట్టూ, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు వాపోయారు. రావిపహాడ్ ఎంపీటీసీ ఆయనకు సంబంధించిన వారికే ఇళ్లు మంజూరు చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయించాలని కోరారు.


నిరుపేద లబ్ధిదారులపై ఎంపీటీసీ కుటుంబ సభ్యుల దాడి..

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని అప్పన్నగూడెంలోని ఇళ్ల ధర్నా చేస్తున్న నిరుపేదలపై రావిపహాడ్ ఎంపీటీసీ సంద్ర పద్మమధు కుటుంబ సభ్యులు దాడి చేసి కళ్లలో కారం చల్లారు. మా ఊరులో నిర్మించిన ఇళ్లల్లో మేమే ఉంటాం మీరెవ్వరని బెదిరిస్తున్నారని పలువురు నిరుపేదలు ఆవేదన వ్యక్తం చేశారు.

‘ఉపా’ కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలి

కోదాడఅర్బన్ : రాష్ట్రంలోని పలువురు ఉద్యమకారులపై పెట్టిన ఉపా కేసులను ప్రభుత్వం బేషరతుగా ఉపసంహరించుకోవాలని, కొంత మందిపైనే కేసును ఎత్తివేయడం సమంజసం కాదని, పూర్తిగా ఎత్తివేయాలని ఉమ్మడి జిల్లా మాజీ డీసీసీబీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యలో నిరసనలు, ఉద్యమాలు సహజమని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన ప్రతి వారిపై కేసులు పెట్టడం అంబేద్కర్ రాజ్యాంగాన్ని గౌరవించడమా లేక అపహాస్యం చేయడమా ఆయన ప్రశ్నించారు. గత ప్రభుత్వాలు ఈ పద్ధతిని అవలంభిస్తే తెలంగాణ రాష్ట్రం సాధించే వారిమా అని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే నాయకులు, సమాజాన్ని చైతన్యవంతం చేస్తున్న మేథావుల మీద కాకుండా అవినీతి, అక్రమాలకు పాల్పడి ప్రజా సొమ్మును దోచుకునే వారిపైన, మహిళలపై అత్యాచారాలు చేస్తున్న వారిపైన ఉపా కేసులు పెట్టాలని అన్నారు.

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల చేరిక


కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు

మునగాల : మండలంలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన సుమారు 20 బీఆర్ఎస్ పార్టీ కుటుంబాలు స్థానిక సర్పంచ్ బూసిపల్లి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ ఎర్రం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరినట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య ఆదివారం తెలిపారు. ఈ మేరకు ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస ఎలియాస్ బోస్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నల్లగొండ ఎంపీ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మావతి నాయకత్వంలో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో కోదాడ, హుజుర్‌నగర్ నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బచ్చు అశోక్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వేనేపల్లి వీరబాబు, గంగుల హరిబాబు, శ్యామ్‌సుందర్‌రెడ్డి, వీరరాఘవరెడ్డి, కోటేశ్వరరావు, వీరస్వామి, నవీన్, ఎర్రయ్య, రాజేష్, నాగరాజు, సైదిరెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : గ్రామీణ విద్యార్థులు కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పీఎం దిశ కార్యక్రమం కో ఆర్డినేటర్ మేకల నాగరాజు కోరారు. ఆదివారం మండల పరిధిలోని చెన్నకేశ్వాపురంలో 14నుంచి 60సంవత్సరాల లోపు వారికి కేంద్ర ప్రభుత్వం పథకం ద్వారా ఉచితంగా నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కంప్యూటర్ విద్య నేర్చుకొనే విద్యార్థులకు నిత్యం పరీక్షలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేఘన, వినయ్, వైష్ణవి, మనీషా, లోకేశ్, గణేష్, జరీనా, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి కృషిచేయాలి

నేరేడుచర్ల : బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని సోమారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు లొడంగి గోవర్ధన్ ఆ పార్టీకి రాజీనామా చేసి బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించి మాట్లాడారు. నియోజకవర్గంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు బీఎస్పీకి మద్దతు తెలిపేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రాజ్యాధికారం కోసం బడుగు, బలహీన వర్గాలందరూ ఏకతాటిపైకి రావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పెదపంగ ఉపేందర్, నాయకులు కత్రి సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

● ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్

చిలుకూరు : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులు నడుస్తున్నాయని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాలలో మన ఊరు- మన బడి పథకంలో భాగంగా రూ.7లక్షలతో ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలతో కూడిన పాఠశాలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు విస్తృతంగా ప్రచారం చేసి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరేలా చూడాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఈదయ్య, ఎంఈఓ సలీమ్ షరీఫ్, మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు వడ్డేపల్లి కళ్యాణి కోటేష్, బెల్లంకొండ రమణ నాగయ్య, అనంత సైదయ్య, షేక్ పాషా, గన్నా అశోక్, శోభన్‌బాబు, శ్రీనివాస్, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన వంతెనకు శంకుస్థాపన..


చిలుకూరు : వంతెన పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్

మండలంలోని మాధవగూడెం గ్రామపరిధిలోని నాగార్జునసాగర్ ప్రధాన కాలువపై రూ.కోటి 4లక్షలతో నిర్మించనున్న నూతన వంతెన నిర్మాణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం సాగునీటికి అధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో సాగు నీటి రంగంలో గొప్ప ప్రగతిని సాధించదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాదాసు లింగయ్య, సొసైటీ చైర్మన్ బాషం సైదులు, వైస్‌చైర్మన్ అక్కినపల్లి జానకీరామాచారి, నాయకులు వట్టికూటి నాగయ్య, తాళ్లూరి శ్రీనివాస్, వేనేపల్లి ఉపేందర్, ఎంపీడీఓ ఈదయ్య, ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఇరిగేషన్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ : ఎమ్మెల్యే


పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్

కోదాడరూరల్ : బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ప్రభుత్వ పాఠశాలకు మహర్దశ పట్టుకుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చిమిర్యాల ప్రాథమిక పాఠశాలలో రూ.15.26లక్షలతో చేపట్టిన మను ఊరు- మనబడి పనులను ప్రారంభించి మాట్లాడారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండాలనే లక్ష్యంతో మన ఊరు మన బడిలో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చింత కవితారాధారెడ్డి, జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారిశేషు, సర్పంచ్ కొండా శైలజ, ఎంపీటీసీ కలకొండ సౌజన్య, ఎంఈఓ ఎండీ.సలీంషరీఫ్, బాలకృష్ణ ఉన్నారు.

‘చలో హైదరాబాద్’ను విజయవంతం చేయాలి


కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

కోదాడ : లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 20న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు బాబునాయక్‌లు కోరారు. ఆదివారం పట్టణంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్టీ జాబితాలో 11కులాలను చేర్చాలనే నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, ఎస్టీలకు రిజర్వేషన్లు 7.5 శాతం నుంచి 14శాతానికి పెంచాలని, ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలనే డిమాండ్లతో నిర్వహించే ధర్నాను జిల్లా వ్యాప్తంగా ఉన్న లంబాడీలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు అభినందనీయం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, మున్సిపల్ మాజీ చైర్మన్

హుజూర్‌నగర్‌రూరల్ : తలసేమియా బాధితులకు రక్తదానం శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మర్రిగూడెంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సర్పంచ్ గల్లా సైదులతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కడియం శ్రీను జయంతి సందర్భంగా శ్రీను స్నేహితులు కడియం శ్రీను ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. కాగా శ్రీను మిత్రులందరూ కలిసి తలసేమియా బాధితులకు రక్తం అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు దేవిశెట్టి వేణు, గోపి, శ్రీకాంత్, రాజశేఖర్, మధు, సైదులు, సతీష్, వార్డు సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

మునగాల : మండలంలోని రేపాలలో మూడు నిరుపేద కుటుంబాలకు బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లుట్ల శ్రీనివాస్ సహకారంతో నిత్యావసర సరుకులు అందజేసినట్లు పార్టీ మండల అధ్యక్షుడు అనంతుల శ్రీనుగౌడ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేద వర్గాల కోసం బీఎస్పీ నిరంతరం కృషిచేస్తుందని, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను సీఎంగా, పిల్లుట్ల శ్రీనివాస్‌ను కోదాడ ఎమ్మెల్యేగా చేసేందుకు బడుగు, బలహీన వర్గాల వారు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు సొంపంగు కార్తీక్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, చిట్టిబాబు, సొంపంగు బాలు, రేపాల గ్రామశాఖ అధ్యక్షుడు చిర్ర గుర్వయ్య తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

హుజూర్‌నగర్ : ఎమ్మార్పీఎస్ టీఎస్ ఆధ్వర్యంలో మాదిగ జనాభా ప్రకారం సీట్లు కేటాయించాలని కోరుతూ ఈనెల 30న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమ కరపత్రాలను ఆదివారం పట్టణంలోని టౌన్‌హాల్లో ఆ సంఘం నాయకులు విడుదల చేశారు. అనంతరం ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వి.శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.పెంటయ్య, పి.వెంకటనారాయణ, కె.రామయ్య, పి.కాటమయ్య, సీహెచ్.సైదులు, ఆర్.నాగరాజు, కె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మన్ కీ బాత్ వీక్షించిన నాయకులు

హుజూర్‌నగర్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని పట్టణంలో బీజేపీ నాయకులు ఆదివారం వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి, నాయకులు డి.రామరాజు, కె.కోటిరెడ్డి, డి.యల్లయ్య, గోపి, మురళి, ఉమామహేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కు అందజేస్తున్న కృష్ణానాయక్

గరిడేపల్లి : మండలంలోని కల్మలచెరువు గ్రామానికి చెందిన యడవల్లి నారాయణమ్మకు మంజూరైన రూ.60వేలు, గునగంటి లింగయ్యకు రూ.18వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్ ఆదివారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు అందజేశారు.